మక్కలతో అధిక లాభాలు

- తక్కువ శ్రమ, స్వల్ప పెట్టుబడితో మొక్కజొన్న సాగు
- అప్పుల ఊబిలోంచి రైతులకు ఉపశమనం


జఫర్‌గఢ్ శివారులో బండపై రైతులు ఆరబోసిన మక్కలు

జఫర్‌గఢ్: వరుస నష్టాలతో చతికిలపడిన రైతులకు మొక్కజొన్న సాగు లాభాలను తెచ్చిపెడుతోంది. ఆశించిన స్థాయిలో పంట దిగుబడి రావడంతో అప్పుల ఊబిలోంచి రైతులకు ఉపశమనం లభించినట్లయింది. మండలంలో గతంలో ఎన్నడూ లేని విధంగా రైతులు ఈసారి అత్యధిక విస్తీర్ణంలో మొక్కజొన్న పంటను సాగు చేశారు. తక్కువ పెట్టుబడులు, తక్కువ శ్రమ, నీటి వినియోగంతో కొద్దిరోజుల్లోనే పంట చేతికి వస్తోంది. దీంతో రైతులు మొక్కజొన్న సాగుపై ఎక్కువగా దృష్టిసారించారు. పైగా ఈ పంటకు అనువైన భూములు ఉండడం కూడా రైతుల కు కలిసొచ్చింది. గతేడాది 4 వేల 200 ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగు చేయగా ఈ ఏడాది రబీలో 5 వేల 150 ఎకరాల్లో పంట సాగుచేసినట్లు వ్యవసాయ శాఖ అధికారులు తెలుపుతున్నారు. కాగా, పంట సాగు చేసినప్పటి నుంచి మొదలు దిగుబడి వచ్చే వరకు తెగుళ్ల ఆశించలేదు. ఇప్పటికే దాదాపు పంట రైతుల చేతికి అందివచ్చింది. ఒక్కో ఎకరాకు 25 నుంచి 35 క్వింటాళ్ల వరకు దిగుబడి రావడం, దీనికితోడు మార్కెట్‌లో మక్కలకు ధర కూడా ఉండడంతో రైతులకు కలిసోచ్చినట్లయింది. ఒక్కో ఎకరాకు రూ.10 వేల నుంచి రూ.15 వేలు మించకుండా పెట్టుబడి పెడితే సుమారు రూ.55 వేల నుంచి రూ.65 వేలు రాబడి రావడంతో రైతులు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు.

ఈసారి మొక్కజొన్న సాగు కలిసొచ్చింది



మూడెకరాల్లో మొక్కజొన్న పంట సాగు చేశా. సాగు చేసిన నాటి నుంచి మొదలు కోత కోసే వరకు సుమారు రూ.20 వేలు పెట్టుబడి పెట్టా. మూడెకరాలకు 103 క్వింటాళ్ల పంట దిగుబడి రాగా, క్వింటా మక్కలకు మార్కెట్‌లో రూ.2,270 ధర పలికింది. ఈ సారి పత్తి, వరి పంట వల్ల నష్టపోతే మొక్కజొన్న సాగు కొంత లాభాన్ని తెచ్చిపెట్టింది.

\- భూక్య యాకూబ్‌నాయక్, రైతు, కేజీతండా

రైతులకు ఎంతో మేలు

గతంలో ఎన్నడు లేని విధంగా ఈ సారి రబీలో రైతులు ఎక్కువ శాతం మొక్కజొన్న పంట సాగు చేశారు. ఈ పంటకు పెద్దగా తెగుళ్ల బెడద లేకపోవడంతో పాటు తక్కువ పెట్టుబడులు, నీటి వినియోగంతో రైతులు అధిక దిగుబడులు సాధించారు. రబీలో ఎక్కువగా వరి పంటకు బదులుగా ఆరుతడి పంటలైన మొక్కజొన్న తదితర పంటను సాగు చేసినట్లయితే అకాల వర్షాలు వచ్చినా రైతులకు పెద్దగా నష్టం ఉండదు. కావున రైతులు ఎక్కువగా ఆరుతడి పంటల పైనే ఎక్కువగా దృష్టి సారిస్తే ఎంతో మేలు జరుగుతుంది.

\- కరుణాకర్‌రెడ్డి, మండల వ్యవసాయ అధికారి

క్లుప్తంగా

ఎమ్మెల్యే శ్రీహరికి ఆహ్వానం



చిల్పూరు: పల్లగుట్ట గ్రామంలో ఈనెల 27 నుంచి 30వ తేదీ వరకు నిర్వహించనున్న భూలక్ష్మి (బొడ్రాయి), షణ్ముఖేశ్వర ధ్వజస్తంభం ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమాలకు హాజరుకావాని ఎమ్మెల్యే కడియం శ్రీహరిని హనుమకొండలో కలిసి గురువారం చిల్పూరు ఆలయ చైర్మన్ శ్రీధర్‌రావు పుష్పగుచ్ఛంతోపాటు ఆహ్వాన పత్రికను అందజేశారు. నాయకులు చిర్ర నాగరాజు, రత్నాకర్‌రెడ్డి, శ్యాంసుందర్, పేరాల సుధాకర్, జీడఆనందం , చొక్కయ్య ఉన్నారు.

శ్రీకాంత్‌గౌడ్‌ను అభినందించిన కేసీఆర్



దేవరుప్పుల: నియోజకవర్గంలో ఎర్రబెల్లి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించడంపై బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు, సామాజికకర్త బబ్బూరి శ్రీకాంత్ గౌడ్‌ను ఆ పార్టీ అధినేత కేసీఆర్ అభినందించారు. గురువారం ఎర్రవెల్లి ఫామ్‌హౌజ్‌లో తెలంగాణ తొలి సీఎం, బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌ను శ్రీకాంత్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఓరుగల్లులో తలపెట్టిన పార్టీ రజతోత్సవ కార్యక్రమాల నిర్వహణ, బహిరంగ సభ తదితర అంశాలపై దిశా నిర్దేశం చేస్తూ పార్టీ బలోపేతానికి, యువత కోసం సేవా కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు.

ప్రజాసమస్యల పరిష్కారం వామపక్ష పార్టీలకే సాధ్యం

దేవరుప్పుల: ప్రజాసమస్యల పరిష్కార ఉద్యమాలు వామపక్షపార్టీలకే సాధ్యమని సీపీఐ మండల కార్యదర్శి జీడీ ఎల్లయ్య అన్నారు. గురువారం కడవెండి గ్రామ సీపీఐ మహాసభ బెజగం ఎల్లయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అధికారం కోసం ఆకర్షణీయమైన పథకాల పేరిట కార్పొరేటీకరణ వ్యవస్థకు పెద్ద పీట వేస్తున్నారన్నారు. క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యల సాధన కోసం సమరశీల పోరాటాలు ఏకైక మార్గమన్నారు. ఏఐటీయూసీ మండల కార్యదర్శి ఎడ్ల సోమనారాయణ, జిల్లా సహాయ కార్యదర్శి సుజిత్, భిక్షపతి, రుద్రోజు ఉప్పలయ్య, మేడబోయిన సోమయ్య, యాదగిరి, విజయ్, అబ్రోస్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

జనగామ రూరల్: గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించడంతోపాటు బెల్టుషాపులను మూసివేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు సాంబరాజు యాదగిరి, మండల కార్యదర్శి బోడ నరేందర్ డిమాండ్ చేశారు. గురువారం తాండ్ర ఆనందం అధ్యక్షతన నిర్వహించిన మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. సర్పంచ్‌ల పదవీకాలం ముగిసినప్పటి నుంచి గ్రామాల్లో ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయన్నారు. వెంటనే సమస్యలు పరిష్కరించాలని కోరారు. పోత్కానూరి ఉపేందర్, బోడ రాములు ,మాదోజు రామాసోక్కం, గటయ్య దండు, శ్రీను పాల్గొన్నారు.

నిబంధనల ప్రకారం నిర్మించాలి

బచ్చన్నపేట: ప్రజలకు అవసరమైన నిర్మాణాలను నిబంధనల ప్రకారం నిర్మించాని జనగామ ఆర్డీఓ గోపీరామ్ అన్నారు. గురువారం పోచన్నపేట గ్రామంలో నిర్మిస్తున్న ఓ పెట్రోల్ పంపు నిర్మాణాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ పెట్రోల్ పంపు నిర్మాణానికి నేషనల్ హైవే, కరెంట్, పలు శాఖల అధికారుల అనుమతులు ఉన్నాయని, చుట్టు పక్కల రైతుల ఇష్టంతోనే నిర్మాణం చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ఆయన వెంట తహసీల్దార్ ప్రకాశ్‌రావు, చేర్యాల మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాసపేట రవీందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

క్షేత్ర స్థాయిలో పరిశీలించాలి


లబ్ధిదారుల ఇంటిని పరిశీలిస్తున్న ఎంపీడీఓ

బచ్చన్నపేట: గ్రామాల్లో ఎంపికైన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని ఎంపీడీఓ వెంకటమల్లికార్జున్ అన్నారు. గురువారం బసిరెడ్డిపల్లి గ్రామంలో పలువురు లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో ఎంపిక చేసిన లబ్ధిదారుల ఇళ్లను పరిశీలించి లిస్టులను సంబంధిత అధికారులకు పంపించాల్సి ఉంటుందన్నారు. కావున పంచాయతీ కార్యదర్శులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు పరిశీలన చేయాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శి నర్సింహచారి, కమిటీ సభ్యులు ఉన్నారు.

'భూభారతి'తో వివాదాలకు పరిష్కారం

- ఎమ్మెల్యే కడియం శ్రీహరి


జఫర్‌గఢ్: మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీహరి, పక్కన కలెక్టర్ రిజ్వాన్‌బాషా, అధికారులు

జఫర్‌గఢ్: రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా తీసుకవచ్చిన భూభరతి పోర్టల్ ద్వారా భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో గురువారం ఏర్పాటు చేసిన భూభారతి అవగాహన సదస్సుకు కలెక్టర్ రిజ్వాన్‌బాషా షేక్‌తో కలిసి ఎమ్మెల్యే కడియం శ్రీహరి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీహరి మాట్లాడుతూ గత ప్రభుత్వం తీసుకవచ్చిన ధరణి పోర్టల్ వల్ల రైతులు పడుతున్న ఇబ్బందులను గుర్తించి కాంగ్రెస్ ప్రభుత్వం భూభారతిని తీసుకొచ్చిందన్నారు. ఇది రైతుల శ్రేయస్సు కోసం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. దీనివల్ల రైతుల భూములకు రక్షణ లభిస్తుందని తెలిపారు. కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ మాట్లాడుతూ భూభారతి ద్వారా రైతులు భూ సమస్యలను త్వరగా పరిష్కరించుకోవచ్చన్నారు. సదస్సులో ఆర్డీఓ డీఎస్ వెంకన్న, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ లావణ్య శిరీష్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ తీగల కర్ణాకర్‌రావు, వైస్ చైర్మన్ నూకల ఐలయ్య, మండల ప్రత్యేక అధికారి రాధాకిషన్, తహసీల్దార్ శంకరయ్య, ఎంపీడీఓ సుమన్, మార్కెట్ డైరక్టర్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

భూభారతిని వినియోగించుకోండి


బచ్చన్నపేట: కొనుగోలు కేంద్ర నిర్వాహకులతో మాట్లాడుతున్న కలెక్టర్ రిజ్వాన్ బాషా

బచ్చన్నపేట: భూభారతి పోర్టల్‌ను రైతులు వినియోగించుకోవాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. మండల కేంద్రంలోని ఐకేపీ కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించి రైతుల వివరాల రికార్డులను పరిశీలించారు. అనంతరం రైతులకు భూభారతి–ఆర్‌ఓఆర్–2025 చట్టంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సుహాసిని, ఆర్డీఓ గోపీరామ్, డీఏఓ రామారావు నాయక్, తహసీల్దార్ ప్రకాశ్‌రావు, ఎంపీడీఓ వెంకట మల్లికార్జున్, ఏఓ విద్యాకర్‌రెడ్డి, ఏపీఎం నాగేశ్వర్‌రావు, సీసీ విజయలక్ష్మి, ఏఈఓలు పాల్గొన్నారు.

సభ జయప్రదానికి కృషి చేయండి


వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ప్రేమలతారెడ్డి

రఘునాథపల్లి: ఈ నెల 27వ తేదీన ఎల్కతుర్తిలో నిర్వహించనున్న బీఆర్‌ఎస్ రజతోత్సవ సభ జయప్రదానికి ప్రతి కార్యకర్త సైనికుల్లా పనిచేయాలని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకురాలు గాడిపెల్లి ప్రేమలతారెడ్డి అన్నారు. గురువారం మండలంలోని అశ్వరావుపల్లి, ఖిలాషాపూర్‌లో ఆమె పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి సభ వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. రైతుబంధు, రుణమాఫీ వంటి పథకాలు అమలు చేయడం లేదని విమర్శించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వై.కుమార్‌గౌడ్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ ముసిపట్ల విజయ్, నాయకులు ఆకుల కుమార్, జిట్టి వీరస్వామి, కావటి యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

సభకు తరలిరావాలి

పాలకుర్తి: రజతోత్సవ సభకు అధిక సంఖ్యలో తరలిరావాలని బీఆర్‌ఎస్ నాయకులు గ్రామాల్లో పర్యటించి ప్రజలను కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పసునూరి నవీన్, మాజీ జెడ్పీటీసీ పుస్కూరి శ్రీనివాసరావు, మాజీ ఎంపీపీ నల్లనాగిరెడ్డి తదితరులు ఉన్నారు.

విజయవంతం చేయాలి

దేవరుప్పుల: తెలంగాణ సాధన కోసం ఆవిర్భవించిన బీఆర్ఆర్‌ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు పల్ల సుందర్‌రామిరెడ్డి పిలుపునిచ్చారు. ఈ మేరకు చిన్నమడూరులో సభ వాల్‌పోస్టర్లను నాయకులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. అలాగే మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు తీగల దయాకర్ జనసమీకరణ కోసం సమావేశం నిర్వహించారు. నాయకులు, దామోదర్‌రెడ్డి, వంగ అర్జున్,జోగేశ్వర్, నర్సింహులు, నవీన్ నాయక్,లొడంగి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం


విరాళం అందిస్తున్న లక్ష్మీనారాయణ దంపతులు

స్టేషన్‌ఘన్‌పూర్: ఘన్‌పూర్ డివిజన్ కేంద్రంలోని తిరుమలనాథ స్వామి దేవాలయ ఆవరణలో నూతనంగా నిర్మాణం చేపడుతున్న ఆంజనేయస్వామి దేవాలయ నిర్మాణానికి స్థానిక పావని బుక్‌స్టాల్ యజమాని కొడ లక్ష్మీనారాయణ, ఉమ దంపతులు తమవంతుగా గురువారం రూ.25వేలు విరాళం అందజేశారు. ముందుగా ఏకాదశి సందర్భంగా నిర్వహించిన పంచామృత అభిషేక పూజల్లో వారు పాల్గొన్నారు. అనంతరం తమవంతుగా ఆంజనేయ స్వామి దేవాలయ నిర్మాణానికి రూ.25వేలు అందించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు కలకోట రామానుజచార్యులు, భక్తులు యాద శ్రీనివాస్, కొలిపాక సతీష్, గోలి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యం

- ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

కొడకండ్ల: అర్హులైన వారందరికి సంక్షేమ పథకాలు అందించాలన్నదే తన లక్ష్యమని ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. గురువారం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ధరావత్ సురేష్‌నాయక్ ఆధ్వర్యంలో వివిధ గ్రామాల నాయకులతో హైదరాబాద్‌లో ఎమ్మెల్యే సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లోని నిరుపేదలైన అర్హులకు ఇందిరమ్మ ఇళ్ల అందేలా నాయకులు బాధ్యత వహించాలని, రాజకీయాలకు అతీతంగా అన్ని వర్గాల వారికి ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందన్నారు. పేదల సొంతింటి కలను సాకారం చేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. సమావేశంలో పట్టణ అధ్యక్షుడు మసురం రవిందర్, మార్కెట్ డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

ఏఐసీసీ ఇన్‌చార్జ్‌ను కలిసిన ఎమ్మెల్యే

పాలకుర్తి టౌన్: అఖిల భారత కాంగ్రెస్ కమిటీ(ఏఐసీసీ)తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్‌ను హైదరాబాద్ గాంధీభవన్‌లో ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి తీసుకుంటున్న చర్యలను మీనాక్షి నటరాజన్‌కు వివరించారు.

ఉగ్రదాడికి నిరసనగా కొవ్వొత్తుల ర్యాలీ


కొవ్వొత్తులతో నినాదాలు చేస్తున్న గ్రామస్తులు

లింగాలఘణపురం: జమ్మూకశ్మీర్‌లో పర్యాటకులపై జరిగిన ఉగ్రదాడికి నిరసనగా గురువారం రాత్రి మండల కేంద్రంలో వీడీసీ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహం నుంచి బస్టాండ్ వరకు పోలీసు అమరవీరుల స్తూపం వరకు ర్యాలీ నిర్వహిస్తూ ఉగ్రవాదులకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ దాడిని ఖండించారు. మార్కెట్ డైరెక్టర్ శ్రీలతారెడ్డి, నాయకులు వీరయ్య, మల్లేశం, చంద్రయ్య, వీడీసీ కమిటీ అధ్యక్షుడు రమేష్, లక్ష్మీనారాయణ, రాంచందర్ పాల్గొన్నారు.

'కార్మికుల హక్కులను కాలరాస్తున్న కేంద్రం'


మాట్లాడుతున్న రాపర్తి రాజు

రఘునాథపల్లి: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మికులు సాధించుకున్న హక్కులను కాలరాస్తుందని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు రాపర్తి రాజు ఆరోపించారు. గురువారం మండల కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో మండల కమిటీ సభ్యుడు నామాల యాదగిరి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎనమిది గంటల పనిదినాన్ని తుంగలో తొక్కి కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేసేలా విధానాలు చేస్తుందని విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేస్తూ, మరో వైపు ధరలు విపరీతంగా పెంచి పేద ప్రజలపై భారం వేస్తున్నారని దుయ్యబట్టారు. సమావేశంలో సీపీఎం మండల కార్యదర్శి గంగాపురం మహేందర్, మండల కమిటీ సభ్యులు కడారి ఐలయ్య, మైలారం వెంకటేశ్వర్లు, శాగ యాదగిరి, అంజనేయులు, దాసు, రాజు, పెద్ద అంజనేయులు, సాంబరాజు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటించాలి


బచ్చన్నపేట: సన్మానం పొందిన జీపీ ఉద్యోగులతో డీపీఓ స్వరూపారాణి

జిల్లా పంచాయతీ అధికారి స్వరూపారాణి

బచ్చన్నపేట: ఆరోగ్యంగా ఉండడానికి ప్రతి ఒక్కరూ పరిశుభ్రతను పాటించాలని జిల్లా పంచాయతీ అధికారి నాగపురి స్వరూపారాణి అన్నారు. గురువారం పంచాయతీరాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంలో జీపీ ఉద్యోగులను సన్మానించారు. అలాగే మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, జీపీ కార్మికులకు చేతులను శుభ్రంగా కడుక్కోవాలని ఆమె సూచించారు. ఎస్‌బీఎం మేనేజర్ కర్ణాకర్, ఎంపీడీఓ వెంకటమల్లికార్జున్, పంచాయతీ కార్యదర్శి నర్సింహచారి, అంగన్‌వాడీ టీచర్ జ్యోతి, జీపీ ఉద్యోగులు పాల్గొన్నారు.


నర్మెట: మాట్లాడుతున్న కందకట్ల శ్రీధర్

ఘనంగా పంచాయతీరాజ్‌డే

నర్మెట: మండలకేంద్రం గ్రామపంచాయతీ సమావేశ మందిరంలో గురువారం నేషనల్ పంచాయతీరాజ్‌డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యదర్శి కందకట్ల శ్రీధర్ మాట్లాడుతూ వ్యక్తిగత పారిశుద్ధ్యంతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, మరుగుదొడ్లను వినియోగించాలని, ఆరుబయట మలవిసర్జన చేయడం నిషేధమన్నారు. చెత్తను రోడ్లపైగాని, మురుగు క్వాలలో గాని వేయరాదని, ఇంటింటా మొక్కలు పెంచాలని, గ్రామాలు పరిశుభ్రంగా ఉంటేనే ఆరోగ్యంగా ఉంటామని తెలిపారు. అనంతరం పారిశుద్ధ్యంపై ప్రతిజ్ఞ చేశారు. బిల్ కలెక్టర్ చిర్ర వెంకట్ రెడ్డి, ఏఎన్‌ఎం2 కరుణ, ఆశాలు పాల్గొన్నారు.

పౌష్టికాహారం తీసుకుని ఆరోగ్యంగా ఉండాలి


సామూహిక సీమంతాలు చేస్తున్న సీడీపీఓ, అంగన్‌వాడీ టీచర్లు

తరిగొప్పుల: పౌష్టికాహారాన్ని తీసుకొని తల్లులు, పిల్లలు ఆరోగ్యంగా ఉండాలని తహసీల్దార్ మొగుల్ల మహిపాల్‌రెడ్డి, సీడీపీఓ రమాదేవి అన్నారు. గురువారం మండలకేంద్రంలోని రైతు వేదిక భవనంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రంగమ్మ అధ్యక్షతన పోషణ పక్షోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సామూహిక సీమంతాలు, అన్నప్రసన్న, అక్షరాభ్యాసం నిర్వహించారు. పోషకాహారంపై గర్భిణులు, బాలింతలు, తల్లులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి భాగ్యలక్ష్మి, ఏఎన్‌ఎం వసంత, ఎంపీఓ మాలతి, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

శిశువుల అభ్యున్నతే అంగన్‌వాడీల లక్ష్యం


అవగాహన కల్పిస్తున్న సత్యవతి

దేవరుప్పుల: పుట్టిన ప్రతి శిశువు అభ్యున్నతే అంగన్‌వాడీ కేంద్రాల లక్ష్యమని ఐసీడీఎస్ సీడీపీఓ సత్యవతి అన్నారు. మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ పక్షోత్సవాలు పురస్కరించుకొని గర్భిణులకు సామూహిక సీమంతాలు, పౌష్టికాహారంపై ప్రదర్శన, చిన్నారులకు అన్నప్రాసన, అక్షరాభ్యాసం తోపాటు ప్రాథమిక పాఠశాలకు వెళ్లే చిన్నారులకు గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. సూపర్‌వైజర్ సావిత్రి, గ్రామ కార్యదర్శి మధుకర్, ఏఎన్‌ఎం వసంత, అంగన్‌వాడీ టీచర్లు సులోచన, శోభ, యాదమ్మ, భాగ్య పాల్గొన్నారు.

జఫర్‌గఢ్: పిల్లల్లో సృజనాత్మకతను పెంపొందించేందుకు ఆట పాటలు నిర్వహిస్తున్నట్లు ఐసీడీఎస్ సూపర్ వైజర్ అనిత తెలిపారు. మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు ఆట పాటలు నేర్పించడంతో పాటు సాంస్కృతిక పోటీలను తల్లిదండ్రుల ఎదుట గురువారం నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్ జగదీశ్వరి, తల్లిదండ్రులు, పిల్లలు పాల్గొన్నారు.

చిల్పూరు: చిరుధాన్యాలతో పిల్లల్లో రోగ నిరోధక శక్తిని పెంపొందించవచ్చని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ దూలమ్మ అన్నారు. మల్కాపూర్ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో సఖి కేంద్రం ఆధ్వర్యంలో చిరుధాన్యాలతో పిల్లలకు కలిగే లాభాలపై తల్లులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వాణిస్వర్ణ వీణ తదితరులు పాల్గొన్నారు.

చెరువు శిఖం భూములను పరిరక్షించాలి


ఏఓకు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

జనగామ రూరల్: పట్టణంలోని చెరువు శిఖరం భూములను పరిరక్షించి చెరువు కుంటలకు ఎఫ్‌టీఎల్ బఫర్ జోన్ హద్దులు ఏర్పాటు చేయాలని సీపీఎం పట్టణ కార్యదర్శి జోగు ప్రకాశ్, బూడిద గోపి డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఏఓ మన్సూరికి వినతి పత్రం అందజేశారు. వెంకట మల్లయ్య, గంగరబోయిన మల్లేష్ రాజ్, శ్రీకాంత్ ,యాదగిరి,, తదితరులు పాల్గొన్నారు

సంక్షిప్త సమాచారం

ప్రతిపక్షాల అసత్య ప్రచారాన్ని తిప్పికొట్టాలి

కొడకండ్ల: రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ ప్రభుత్వంపై ప్రతిపక్షాలు చేసే అసత్య ప్రచారాన్ని తిప్పికొట్టాలని నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ధరావత్ రాజేష్‌నాయక్ పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని లక్ష్మక్కపల్లి, రామన్నగూడెం, పాకాల గ్రామాల్లో నిర్వహించిన యూత్ కాంగ్రెస్ సమావేశాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాకేష్‌యాదవ్, నాయకులు వెంకట్‌రెడ్డి, శ్రీను, సోమన్న, యుగంధర్‌రెడ్డి, పర్శరామ్, అజయ్, యాకాంబరం, మధు పాల్గొన్నారు.

ముత్యం చెరువును పరిరక్షించండి



దేవరుప్పుల: అప్పిరెడ్డిపల్లె ముత్యం చెరువు దురాక్రమణకు గురికాకుండా అధికారులు సత్వర చర్యలు చేపట్టి పరిరక్షించాలని ఆ గ్రామ మాజీ సర్పంచ్‌లు పులిగిళ్ల మల్లయ్య, సుధాకర్‌లు కోరారు. ఈ మేరకు గురువారం మండల కేంద్రంలో తహసీల్దార్ ఆడెపు అండాలుకు ముత్యం చెరువును లింగాలఘనపురానికి చెందిన ఓ ప్రజాప్రతినిధి ఆక్రమిస్తున్న తీరుపై వినతి పత్రం అందజేశారు. ఈ విషయమై స్పందించిన తహసీల్దార్ క్షేత్రస్థాయిలో వాస్తవిక వివరాలను సేకరించి ఉన్నతాధి కారులకు నివేదికలు పంపిస్తామని, ముత్యం చెరువు ఆయకట్టు రైతులకు విఘాతం కలుగకుండా శాఖపరంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

'గిట్టుబాటు ధర కల్పిస్తోంది కేంద్రమే'

చిల్పూరు: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు గిట్టుబాటు ధర కల్పిస్తోంది కేంద్ర ప్రభుత్వమేనని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు పెరుమాండ్ల వెంకటేశ్వర్లు అన్నారు. రాజవరం గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడి ఏర్పాట్లు, సమస్యలపై రైతులను అడిగి తెలుసుకున్నారు. తాళ్లపల్లి వెంకన్న, మాచర్ల రమేష్ ఉన్నారు.

'ఉద్యమకారులను పట్టించుకోని కేసీఆర్'

పాలకుర్తి టౌన్: ఎంతో మంది ఉద్యమ త్యాగాలు, ఆత్మబలిదానాలతో సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో కేసీఆర్ 10 ఏళ్ల పాలనలో ఉద్యమకారును పట్టించుకోలేదని తెలంగాణ ఉద్యమకారుల ఆకాంక్షల వేదిక రాష్ట్ర నాయకుడు గోదుమల కుమారస్వామి అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఆ సంఘం నియోజకవర్గ స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. సంఘం జిల్లా కన్వీనర్ పోలాస సోమయ్య, నియోజకవర్గ అధ్యక్షుడు మూల ప్రభాకర్‌గౌడ్, సింగ మహేందర్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

రహదారుల విస్తరణ చేపట్టాలి

చిల్పూరు: మండలంలో రహదారుల విస్తరణ చేపట్టాలని బీజేపీ మండల అధ్యక్షుడు ఉపేందర్‌యాదవ్ కోరారు. ఈ మేరకు గురువారం మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.

నియామకం


పర్ష సిద్దేష్

రఘునాథపల్లి: కంచనపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు పర్ష సిద్దేష్ జనగామ వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్‌గా నియామకం అయ్యారు. ఖిలాషాపూర్ గ్రామానికి చెందిన మార్కెట్ డైరెకర్ గాదె రమేశ్ ఇటీవల గుండె పోటుతో మరణించగా..ఖాళీ అయిన ఆయన స్థానంలో ఇదే మండలానికి చెందిన పర్ష సిద్దేష్‌ను నియమించారు. ఈ మేరకు హైదరాబాద్ వ్యవసాయ మార్కెటింగ్ డైరెక్టర్ రఘునందన్‌రావు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

ఆలయ అభివృద్ధి కమిటీ ఏర్పాటు

లింగాలఘణపురం: మండల కేంద్రంలోని ఆంజనేయస్వామి దేవాలయ అభివృద్ధి కమిటీని గురువారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా క్లైపు లక్ష్మీనారాయణ, గౌరవ అధ్యక్షుడిగా లింగాల దీపక్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా కడకంచి రవి, చెన్నూరి లింగరాజు, ప్రధాన కార్యదర్శిగా జుట్టు యాకేశ్, కార్యదర్శిగా రాగల్ల ఆనంద్, కాసోజు సత్యం, ఎడ్ల సంతోష్, కోశాధికారిగా లింగాల ఆదిత్య, సభ్యులను ఎన్నుకున్నారు.

మాజీ జెడ్పీటీసీ మృతి

నర్మెట: మండల కేంద్రం మాజీ సర్పంచ్, మాజీ జెడ్పీటీసి గాదె మోహన్ రెడ్డి(75) అనారోగ్యంతో గురువారం మృతిచెందారు. గుంటూర్‌పల్లికి చెందిన ఆయన 1988–95 వరకు నర్మెట సర్పంచ్‌గా, 2004లో ఉప ఎన్నికలో భాగంగా జెడ్పీటీసీగా ఎన్నికయ్యారు. మలిదశ తెలంగాణా ఉద్యమంలో తనదైన శైలితో చురుకైన పాత్ర పోషించిన ఆయన నేటికీ రాజకీయాలలో కొనసాగుతుండటం గమనార్హం. డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి వెన్నంటే ఉంటూ ప్రజల్లో తనకంటూ గుర్తింపును తెచ్చుకున్నారు. గత నెల రోజులుగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందుతున్న ఆయన గురువారం స్వగృహంలోనే మృతిచెందారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలు

జనగామ రూరల్: బైక్‌పై వెళ్తున్న ముగ్గురిని ఎదురుగా వస్తున్న లారీ ఢీ కొట్టడంతో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలోని పెద్ద పహాడ్ స్టేజీవద్ద గురువారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలానికి చెందిన దాచేపల్లి అభినయ్ వ్యక్తిగత పనుల నిమిత్తం బైక్‌పై జనగామకు వస్తూ దారి మధ్యలో క్రీస్తుజ్యోతి ఇంజనీరింగ్ కళాశాలలో చదువుతున్న ఏనుగుల మహేశ్, మంతపురి వివేక్‌లను బైక్‌పై కూర్చోబెట్టుకున్నాడు. ఈ క్రమంలో పెద్దపహాడ్ బస్‌స్టేజీ వద్ద బచ్చన్నపేటకు వెళ్తున్న లారీ ఢీ కొట్టడంతో బైక్‌పై ఉన్న ఇద్దరికి తీవ్ర గాయాలు కాగా, ఒకరికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు 108 వాహనంలో జనగామ ఏరియా ఆస్పత్రికి వారిని తరలించి చికిత్స అందించారు. తీవ్ర గాయాలైన ఇద్దరిని మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. కాగా, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పరామర్శ

దేవరుప్పుల: రంబోజీగూడెం గ్రామానికి చెందిన ఆగయ్య మృతి చెందాడు. కాగా విషయం తెలుసుకున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు గురువారం గ్రామానికి చేరుకుని బాధిత కుటుంబాన్ని పరామర్శించి మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. సుందర్‌రామిరెడ్డి, దామోదర్ రెడ్డి, దయాకర్, సోమన్న, అర్జున్, సతీష్ తదితరులు ఉన్నారు.